# మరో మనిషి

పక పక నవ్వింది శైవాలిని. అతని మాటలకి. ఆనవ్వుకి సిగ్గుపడ్డాడు నరేంద్రనాథ్. ఆ నవ్వుకే కాదు. ఆ విషయం చెప్పడానికే అతను సిగ్గుపడ్డాడు. "నిజం శైవీ! నేను కిళ్ళీవేసుకోను!" అన్నాడతను మళ్ళీ. తను నవ్వుటాలకి అలా అన్నానని ఆమె అనుకుందేమోనని రెట్టించాడతను.

తెరలు తెరలుగా వస్తున్న నవ్వుని ఆపుకుంది శైవాలిని. నరేంద్ర ఊరికే చూస్తూ వుండిపోయాడు. అతనికి డిఫెండ్ చేసుకోవాలనిపించలేదు, కొద్దిసేపు అలానవ్వి "ఎక్స్‌క్యూజ్ మీ! యింకా యీ రోజుల్లోనూ కిళ్లీ వేసుకోని వాళ్లున్నారంటే నమ్మలేక నవ్వొచ్చింది!" అందామె.

"అవును శైవా! నేను యింతదాకా కిళ్లీ వేసుకోలేదు. నా పెళ్లి రోజున మాత్రం మా మరదలు కారా కిళ్లీ యిస్తే వేసుకున్నాను. అందులో ఆ అమ్మాయి నిజంగానే కారం వేసింది!"

"ఊఁ అయితే వ్రత భంగం అన్నమాట? పోన్లే అది యిక్కడే యీ పూటే ప్రారంభించు" అంది కిళ్లీ అందించబోతూ.

ఇబ్బందిగా ఫీలయ్యాడు.

"డైరెక్ట్ ఏ.సి.టి.వో.వి.....సొసైటీలో పేరున్న వాడివి. ఆఫ్టరాల్ కిళ్లీ వేసుకుందుకే జంకితే రేపు ఎవ్వరయినా డిన్నర్ ఎరేంజ్ చేస్తే ఏం చేస్తావ్? ముందుగా విస్కీయో, రమ్మో, కాక్‌టైలో, షాంపైనో యిస్తారే అదెలా?" అంది శైవాలిని.

నీరుకారి పోయాడు నరేంద్ర "నిజమా" "అన్నట్టు చూశాడతను.

"యస్! మన సి.టి.ఓ సారథిగారు చూడు రంగు, రుచి, వాసన అన్నీ తెలుసుకున్న మహాను భావుడు! నరేన్! ఆయన జీతం మొత్తం బ్యాంక్‌లో వేస్తారు. నెలనెలా యింటికి కావలసినవి అన్నీ జవాన్లు షాపుల్లో పట్టుకొస్తారు. ఇంకో విషయం తెలుసా? ఇంటికి ఖాళీ జేబులతో వెళితే ఆవిడ అన్నం పెట్టదట షేం! షేం!

"లంచాలు పుచ్చుకుంటారా?"

"పుచ్చుకోరు! బలవంతంగా రక్తం పిండినట్టు పిండుతారు. ఇంకో న్యూస్ చెప్పనా? ఆవిడికి భర్త సండే ఆఫీసు కెళ్ళడని కోపం. అందుకే యిబ్బడిగా సోమవారం తీసుకెళ్ళాలి. ఈ మధ్య శాటర్‌డేకూడా సెలవిచ్చారని ప్రభుత్వాన్ని తిట్టిపోస్తుంది. పాపం ఆయనకీ చాలా

యిబ్బంది అయిపోయింది."

లేవబోయాడు నరేంద్రనాథ్

"కూర్చోండి! మనకి బంధుత్వం వుంది. ఒకే ఆఫీసులో వర్క్ చేస్తున్నాం. జంకుతారేం?"

"చూడు శైవీ! నా మిసెస్ సాయంకాలం ఆరు సమీపించే కొద్దీ నాకోసం ఎదురు చూస్తూ వుంటుంది!"

"అయితే అక్కయ్య బాగా కండిషన్లో వుంచిందన్నమాట!" మళ్ళీ నవ్వుతో కిళ్ళీ అందించింది. ఈ పర్యాయం కాదన్లేక పుచ్చుకున్నాడు. నోట్లో వేసుకున్నాడు. "దట్స్ గుడ్" అందామె,

"ఓకే! వస్తాను!"

రేపు ఆఫీసులో కలుస్తాం కదా.

"తలూపి వెళ్ళేడతను."

✧ ✧ ✧

సాయంకాలం ఆరు గంటల నుంచీ భర్త రాక కోసం ఎదురు చూస్తోంది వైజయంతి. సామాన్యంగా అయిదున్నరకి అటూ యిటుగా వచ్చేభర్త యీ రోజు యింకా ఎందుకు రాలేదు. అనుకుంటోందామె.

దాదాపు ఏడుగంటల సమయంలో రోడ్డు మలుపు తిరుగుతూ కనిపించాడు నరేంద్ర అతన్ని చూడగానే ఆమె ముఖం విప్పారింది. మరో రెండు నిమిషాలకి యింటి ముందుకి వచ్చాడతను.

లోపలికి రాగానే "ఏమండీ యింత ఆలస్యమైంది" అడిగింది. అతను సమాధానం చెప్పటానికి నోరు తెరవగానే "హాయ్" అని కేకేసిందామె. ముఖమంతా సంతోషం కప్పేసింది. "కిళ్ళీ వేసుకున్నారా?! అనిఅడిగింది ఆనందోత్సాహాలతో.

కాపీ చేస్తూ దొరికిపోయిన కుర్రాడిలా సిగ్గుపడ్డాడు నరేంద్ర అతను నోరువిప్పి సమాధానం చెప్పలేకపోయాడు. కానీ వైజయంతికి అతను కిళ్ళీ వేసుకోటం ఎంతో ఆనందంగా వుంది. దగ్గరగావచ్చి భర్త భుజాలు పట్టుకొని వేలాడుతూ ప్రేమగా అడిగింది "అబ్బ ఎన్నాళ్ళకి కిళ్లీ వేసుకున్నారు, అసలే మీవి దొండపండ్లలాటి పెదాలా? ఈ కిళ్ళీ వేసుకుంటే యాపిల్ ముక్కల్లా వున్నాయి. అలాగే కొరికేద్దామా అనిపిస్తుంది. నిజం!"

ఇబ్బందిగా ముఖం పెట్టాడతను.

"ఎలా, ఆఫీసులో పార్టీ వుండిందా? అందుకే నన్నమాట ఆలస్యమైంది ? పోన్లెండి మీ ఆఫీసరు బలవంతం చేశాడా ? చూడండి ! రేపటి నుంచి రెగ్యులర్ గా కిళ్ళీ వేసుకొండి. లేదంటే తాంబూలం సామగ్రి అంతా తెప్పిస్తే రోజూ నేనూ మడుపు అందిస్తాను !" ఆనందోత్సాహాలు రెట్టింపుగా అంది వైజయంతి.

న :డు నరేంద్ర.

✧ ✧ ✧

మరో వారం రోజులకి రోజూ కిళ్ళీ వేసుకుందుకి అలవాటు పడ్డాడు. నరేంద్ర ఉదయం ఆఫీసుకి వెళ్ళే ముందు యింటి వాళ్ళ అబ్బాయితో కిళ్ళీ తెప్పించి పెట్టేది వైజయంతి, అతనాఫీసులో లంచ్ అవర్లో టిఫిన్ తీసుకోగానే తాను శ్రద్ధగా యింటి నద్ద నుంచి తెచ్చిన కిళ్ళీ యిచ్చేది శైవాలిని. రాత్రి బెడ్ రూంలో కిళ్ళీ వైజయంతి.

ఆరోజు సాయంకాలం ఎవరో క్లర్క్ ట్రాన్స్‌ఫరయ్యాడని టీపార్టీ ఏరేంజ్ చేశారు. స్వీట్సు తిని, కారా పుచ్చుకుని, టీ తాగాక అందరికి కిళ్ళీలందించారు. ఎర్రబడ్డ నోటికీ సిగరెట్ ఆఫర్ చేశాడు ఆఫీసరు. ఇబ్బందిగా ముఖం పెడితే పెదవి విరిచింది శైవాలిని. అతనికి చప్పున ఆత్మహత్య చేసుకోవాలనిపించింది.

"తీసుకోవోయ్!" అన్నాడాఫీసరు.

అప్రయత్నంగా చేయి చాచేడు నరేంద్ర.

మెచ్చుకోలుగాను, వ్యంగ్యంగాను నవ్వింది శైవాలిని.

వణుకుతున్న చేతులతో సిగరెట్ ముట్టించబోయాడతను. నిప్పుపుల్ల ఆరిపోతే కో ఆఫీసరు నిప్పు పెట్టాడు. తొలిసారిగా సిగరెట్ దమ్ములాగగానే పొరపోయిందతనికి. ముఖం తిప్పుకొని నవ్వింది శైవాలిని.

అందర్నీ కాదని కొద్దిగా దూరం నడిచిందామె. ఏదో గుర్తుగా అతనూ అటు నడిచాడు. 'కంగ్రాట్స్! మగాళ్ళనిపించుకుందికి మరో మెట్టు ఎక్కేరు" అంది. అది అభినందనో, వ్యంగ్యమో తెలియలేదతనికి. కానీ నోరంతా చేదుగా అయిపోయినది. మనస్సూ చేదు తిన్నట్టయింది.

"శైవీ!" అన్నాడు బాధగా.

"ఏం?" కళ్ళెగరేస్తూ అడిగింది.

"మనిషి పర్‌ఫెక్టుగా ఉండకూడదా? హైక్లాస్ సొసైటీ పేరుతో అంకచండాలం తింటూ, తాగరానిది తాగుతూ, సిగరెట్ జులాయి వెధవల్లా కాలుస్తూ, తిరుగుబోతుల్లా కిళ్లీ నవుల్తూ ఉండాలా? వీటన్నిటికి అలవాటు పడకపోతే అతను మొగాడు కాదా?!

నిదానంగా చూసింది శైవాలిని. నరేన్ బాగా ఫ్రూండ్ అయ్యాడనుకొంది. పాసివ్‌గా నవ్వింది.

ఏదో సమాధానం చెప్పబోయింద.

అంతలో సి.టి.వో. కేకెయ్యడంతో వెళ్లి పొయింది

రెక్కలు తెగిన పావురాయిలా ఒంటరిగా నిలుచుండిపోయాడు నరేంద్ర.

తిరిగి యింటికి రాగానే వైజయంతి తను సిగరెట్ తాగినందుకు సంతోషం వెలిబుచ్చగానే అతనికా సంఘటన అంతా గుర్తుకొచ్చింది.

"డామిట్!" అన్నాడు అప్రయత్నంగా.

"ఏమిటి?" నివ్వెరపోతూ అడిగింది వైజయంతి.

"చాలామంది ఆడవాళ్ళు రియల్ లైఫ్‌లో, కథల్లో, నవలల్లో, సిగరెట్ తాగే మొగాళ్లని, కేర్ ఫ్రీగా తిరిగే వాళ్లని నిరసించి ఆ అలవాటు మార్చుకునేట్టుగా చూస్తారు, చేస్తారు. అదేం. నీవు యిలా అంటున్నావ్"

ఫక్కున నవ్వింది ఆమె. "నరేన్! వాళ్లకి లైఫ్ తెలియదు. వీటన్నిటిని దూరం చేసుకొని బ్రతికితేనే పర్‌ఫెక్టు లైఫ్ అనుకుంటారు. అంతా బి.సి. నాటి ఊహలు !".

"జయా!"

"ఏం?"

"నేనూ బిసీ నాటి మనిషినే?!"

కనుబొమ్మలు మూసిందామె.

నేను డిసెంబరు 24న పుట్టాను. బిఫోర్ క్రీస్ట్"

విరబడి నవ్వింది వైజయంతి. చప్పున అతని ముఖాన్ని లాక్కుంది.

✧ ✧ ✧

కెవ్వుమంది శైవాలిని.

చప్పున దూరమయ్యాడు నరేంద్ర "సారీ!" చెపుతూ.

రక్తసిక్తమైన పెదవిని నాలికతో తడుపుకుంది. తన రక్తం తనకే ఉప్పగా అనిపించింది. గ్లాసులోని విస్కీతో అద్దుకుంది. గ్లాసుని ఆమె పెదాలకందించి ! రియల్లీ సారీ" అన్నాడు.

అంతలో నవ్వేసింది శైవాలిని.

"యిది బావుంది. అంతలో నవ్వు అంతలో కోపం! అంతలో సంతోషం అంతలో బాధ భావాలు ఎలా మారతాయబ్బా?"

చిత్రంగా అడుగుతోన్న అతన్ని చూసి ఆమె మళ్లీ నవ్వింది. "నరేన్! బాధలో సుఖం, సుఖంలో బాధ అంటే యిదే!"

"శైవా!"

"ఊఁ"

"నువ్వు నిజంగా ఏంజిల్‌వి?"

"ఎందుకు ?"

"ఈ చలాకీతనం, ఈ అల్లరి మనసు, ఈ సొగసైన మనసు నన్ను తిప్పలు పెట్టాయి. కిళ్లీతో మొదలై కౌగిలిదాకా తెచ్చావు. టీ రుచి మరిగించి విస్కీదాకా రప్పించావు. నిజంగా జీవితంలో మాధుర్యం అంతా రుచి చూపుతున్నావు. థాంక్యూ వెరిమచ్!"

'సో! టుయూ-'

'శైవా!'

"ఊఁ"

"యిప్పుడు ఆఫీసు వదలగానే యింటికి వెళ్ళ బుద్ధి పుట్టదు. నేరుగా నీ గదికి వచ్చెయ్యాలని వుంటుంది!"

'కానీ మా యింటి హోనర్స్ గుసగుసలు పోతున్నారు-'

"యిల్లు మారితే సరి!"

"ఏ యిల్లయినా అంతే!"

"మరేం చేద్దాం?"

"దూర దూరంగా వుందాం. గాసిప్స్ ఆగిపోతాయి. నేను రూం ఛేంజ్ చేస్తాను. లొకాలిటీ మారుతుంది. ఓ నెలో రెండు నెలలో గడిచాక తిరిగి కలుసుకుందాం!"

"అమ్మో! రెండు నెలలు నీకు దూరంగా వుండాలా?"

నవ్వింది శైవాలిని. "రోజూ ఆఫీసులో చూస్తూనే వుంటావుగా?"

"శైవా!"

"మా యింటికి వచ్చెయ్!"

"సిస్టర్!"

"నథింగ్ డూయింగ్, వైజయంతి అడ్డు చెప్పదు."

"యూఁ నువ్వెంత అమాయకుడివి. ఆడవాళ్లు అలా పంచుకోలేరు?"

"నే నొప్పిస్తాగా!"

"ఒప్పిస్తావా? నొప్పిస్తావా?"

"నొప్పించినా ఒప్పిస్తాను"

"ఊహూ సాధ్యం కాదు!"

✧ ✧ ✧

"ఊహూఁ వీలుకాదు. ఎవరో అమ్మాయి మన యింటిలో వుండటమేమిటి? ఇన్నాళ్లూ ఎలా ఉందో అలాగే ఉంటుంది మైడియర్ హస్బెండ్. అత్తామామలే బాదరబందీ అనుకుని మనం ఫ్రీగా ఉంటే మధ్యన ఈ మరో మనిషి ఎవరు ?

తలపంచుకున్నాడు నరేంద్ర.

అతనికంతా చెప్పెయ్యాలనిపించింది. 'జయా!' అన్నాడు వణుకుతున్న గొంతుకతో.

"ఎందుకండీ అంతగా యిగవుతారు ? ఎవరో ఏమిటో మనకెందుకు గొడవ ? హాయిగా జాయిఫుల్ గా ఉండకుండా ?"

"జయా! నీకు తెలియదు!"

"ఏమిటి?"

"జయా! నేను మారిపోయానా?"

'అవుననుకోండి. కారా కిళ్ళీ వేస్తున్నారు, సిగరెట్ కాలుస్తున్నారు. అప్పుడప్పుడూ

డిన్నర్స్‌కి వెళుతున్నారు ! మామూలు ట్వెంటీ ఫస్ట్ సెంచరీ మగాడిలా ఉన్నారు. దానికేం?

"దానికేం అని కాదు. యివన్నీ ఎలా అలవాటయ్యాయనుకుంటున్నావు?"

"నలుగురితో తిరుగుతున్నారు. కంపెనీ కోసం అలవాటయ్యాయి."

"ఊహూఁ కాదు!"

"మరి!"

ఎటో చూస్తూ అన్నాడు. వీటికి కారణం శైవ!"

ఉలిక్కిపడింది వైజయంతి.

"అవును ! శైవాలిని మా మామయ్య కూతురు. మాకూ వాళ్లకీ మధ్య చాలా సంవత్సరాలుగా రాకపోకలు లేవు. అందుకే మన పెళ్లికి వాళ్లు రాలేదు. కానీ జయా! ఈ ఆఫీసుకి ఆవిడ ఈ మధ్యే ట్రాన్స్‌ఫర్ అయి వచ్చింది, తొలిసారిగా టీ పార్టీలో నాతో టీ తాగించి, కిళ్లీ వేయించింది, తర్వాత ఒక్కొక్క మెట్టు ఎక్కించింది! తనలో అనుకున్నట్టుగా అన్నాడు"

"ఇప్పుడు నేరుగా యింటికి వస్తానంటుంది, అవునా"

"తను అన్లేదు? నేనే రమ్మన్నాను. నేను ఆఫీసు వదిలాక తనతో కలిసి తన గదికి వెళ్లి వస్తున్నాను. నీతో ఆఫీసు పని అంటున్నాను. నువ్వు నమ్మేవు. నేను రోజూ తన గదికి రావటం ఆ యింటి వాళ్లకి యిష్టం లేదంది శైవి. అందుకే నేను మనింటికే రమ్మన్నాను?"

రవరవమంటోంది వైజయంతికి, వళ్లంతా కారం రాసి నిప్పుసెగ చూపినట్టుగా ఉంది. ఎంతకు తెగించాడు!' అనుకుంది, యికలాభం లేదు అని అనుకుంది. హద్దుల్లో పెట్టెయ్యాలని కూడా అనుకుంది. "చూడండి! మీరు అంతా యథార్థమే చెప్పారనుకుంటున్నాను!"

ఆమె మాటకి అడ్డొస్తూ యస్! సెంట్ పర్సెంట్ కరెక్ట్!" అన్నాడు.

"కానీ మీ సిన్సియారిటీ మెచ్చుకోకుండా వుండలేకున్నా, మీ నిజాయితీకి నొచ్చుకుంటూ కూడా వున్నాను. నేను నా భర్త ఫ్రీగా ఉండాలనుకున్నాను. సోషల్‌గా ఉండాలనుకున్నాను. అంతేకానీ మరో ఆడదానికి బానిసగా వుండాలనుకోలేదు. యింట్లో పంచభక్ష్య పరమాన్నాన్ని వదిలి వీధిలో హోటల్లో టిఫిన్ తినే మనస్తత్వం మగాళ్లదనేది మా అత్తయ్య. చచ్చి ఎక్కడుందో కాని యదార్థం చెప్పింది."

"మీరూ-నేనూ కలిసి నిర్మించుకున్న స్వర్గం యిది. ఈ స్వర్గంలో డెవిల్స్‌కి స్థానం లేదు. భార్యా భర్తల మధ్య మరో మనిషి చోటు చేసుకొనటం నా కిష్టం లేదు. నేను మరో స్త్రీ వాసననే సహించలేను." ధృఢంగా నిశ్చలంగా కఠిన కంఠంతో అంది వైజయంతి.

"కానీ జయా! నేను-నేను-కమిట్ అయ్యాను! తడబడుతూ అన్నాడు నరేంద్ర.

"చూశారా మీ తడబాటు? మీ అశక్తత? అదేనండీ యిల్లీగల్ కనెక్షన్‌లోని బలహీనత? మీరు నావారు. మీ మనస్సు, తనువు అంతా నాకే స్వంతం- యిందులో యితర్లకి షేర్ లేదు.

కాదని ఎవరైనా దోచుకుంటే పాతకాలంనాటి సుమతిలాగ ఉండను. నరికేస్తాను అడ్డంగా. భర్తని యింట్లో బంధించి, నా కొంగున ముడి వేసుకుంటాను.... అప్పటికీ సాధ్యం కాకపోతే ఉరేసుకుంటాను. అంతేకానీ కలిసి పంచుకోలేను!" ఉద్వేగంగా అంది వైజయంతి.

చప్పున ఆమె భుజాలు పట్టుకున్నాడు నరేంద్ర.

✧ ✧ ✧

మరుసటి వారం వీకెండ్‌లో టీ పార్టీ అరేంజ్ చేశారు. సి.టి.వో. స్వీట్ కారా తీసుకొని టీ తిరస్కరించాడు. కిళ్ళీ ఆఫర్ చేశారు ఎవరో. మృదువుగా తిరస్కరించి టీ, కాఫీ, కిళ్ళీ, సిగరెట్ అన్నీ మానేశాను, నేను పాతలైఫ్‌కి ది ఎండ్ చెప్పేశాను!" అన్నాడు నవ్వుతూ.

గత పదిరోజులుగా తను పిలిచినా తనగదికి తనెందుకు రాకుండా ముభావంగా వుంటున్నాడో అర్థమైంది శైవాలినికి. ముంగొంగు పసిడి చేజారిపోయినట్లుగా అనిపించిందామెకి.

● జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక '80 ●